# సుడిగుండం

పక్కన నిలుచున్న బాబు చేతిని డాక్టర్ తన చేతిలోకి తీసుకుంటు "మీరేం చేస్తారు" అడిగిండు డాక్టర్.

" టీచర్‌ను" అన్నడు నలుబది ఏండ్ల రామరాజు. డాక్టర్ స్టెతస్కోప్‌ను ఎదమీద, వెన్నున వుంచి పరీక్షించాడు. కండ్లు నాలుకను చూస్తు.

"జ్వరం బాగ వుంది. ఎప్పటినుండి వస్తుంది?" అడిగిండు డాక్టర్.

"మూడు రోజులైంది" అన్నడు రామరాజు కొడుకువైపు చూస్తు.

"వెంటనే తీసుకరామచ్చుగ" అన్నడు డాక్టర్.

"తగ్గుతదనుకున్నం"

డాక్టర్ కడుపును వొత్తి చూస్తు

"మందులు వాడకుండారోగం ఎట్ల తగ్గుతుంది" రాజును ఎగాదిగా చూస్తు అన్నడు.

" ఇంతకు ఏమంటరు డాక్టర్" ఆతర్వాత అడిగిండు రాజు.

"టెస్టులు చేయించనది. ఎట్ల తెలుస్తుంది" ఆని స్లిప్‌మీద ఏమేమి టెస్ట్‌లు చేయించాలో రాసి ఇస్తు

" పక్కన్నే ల్యాబ్‌వుంది టెస్టు చేయించి రిపోర్ట్స్ తీసుకుని రండి"

సరె అన్నట్టు తల ఊపి బాబును తీసుకుని బయటికి నడిచాడు. సాయంత్రం ఆరైంది రిపోర్ట్ ఇచ్చేసరికి వాటిని తీసుకుని డాక్టర్ రూమ్ ముందొచ్చి కూర్చున్నడు. కంపౌండర్ బెల్ శబ్దం కాగానె వరుస క్రమాన్ని పాటిస్తు ఒక్కొక్కరినె పంపిస్తున్నాడు. ఆదిచూసిన రాజు పిల్లవానికి జ్వరం బగావుంది కాస్త ముందు పంపియమని అడిగాడు కాని కంపౌండర్ చెవిన పెట్టనట్టు చూసాడు. చేసేది లేక రాజు బాబును ఎదురుగావున్న బెంచిమీద పడుకొపెట్టి తాను తలవైపు కూర్చున్నడు. ఈసారి బెల్ మోగగానే రాజువైపు చూస్తు బాబును తీసుకెళ్లమని సైగచేసాడు రాజు దిగ్గున లేచి బాబును తీసుకుని

లోపలికి నడిచాడు.
'నమస్కారం డాక్టర్"

" నమస్కారం కూర్చొండి, బాబు నీవు ఈ స్టూల్‌మీద కూర్చో" అంటు రాజు ఇచ్చిన రిపోర్ట్‌ను పరీశిలించి పెదవి విరిచాడు " అది చూసిన రామరాజుకు ఓ రకమైన అనుమానం మొలకెత్తి అది మహా వృక్షంగా తయారైంది.

"మీరు నల్లా నీళ్ల తాగుతారా? బావినీళ్లా" అడిగాడు డాక్టర్.

"నల్లా నీళ్లె డాక్టర్" ఆతురతగా అన్నాడు రామరాజు.

"ఏమైంది డాక్టర్" అని అడిగిండు మళ్లీతానె.

"ఏంలేదు ఓ నెలరోజులు ఈ బాబును జాగ్రత్తగా చూసుకోవాలి"

"అసలు విషయం ఏంది డాక్టర్" అనుచుకోలేని ఆతురతతో అడిగిండు రామరాజు.

"జాండీస్ ముదరనీయొద్దు"

అన్నడు. అదివిన్న రాజు నెత్తిన బండపడ్డంత పనైంది.

"జాండీస్ ఓమానాన బాగుకావు. పోగ జాండీస్ వచ్చినవాళ్లు బతికి బట్టకట్టరు" అనుకుంటున్నప్పుడు మందులు రాస్తాను. ఆహారం, నీళ్ల విషయంలో చాల జాగ్రత్తలు తీసుకోవాలి. నూనె తగ్గించిన తిండి, వేడిచేసి చల్లార్చిన నీటినే వాడాలి" అన్నడు డాక్టర్.

రామరాజు మనసు మనస్సులో లేదు. జాండీస్‌తో చనిపోయిన వాల్లందరు గుర్తుకురాసాగారు. ఓవిధంగా జాండీస్‌కు మందే లేదంటువుంటరు. నాటు మందులు వాడాలంటరు. రాగూడదు వస్తె బతకడం కష్టం అంటు వుంటరు. అంతా తలుచుకునేసరికి కడుపులో ఓమాదిరి భయం జొరబడి అది కళ్లల్లో కనిపిస్తుంది. గొంతులో తడారింది. చిరుచెమట చిమ్మింది. ఆతనిపరిస్థితిని గమనించిన డాక్టరు.

"నేనున్నానుగా, మీరేం భయపడకండి " అన్నడు మందులు రాస్తు.

జాండీస్‌తో తనకు తెలిసిన ఓ డాక్టరే పోయింది గుర్తొచ్చింది. పక్కింటి రామనాధం జాండీస్‌తోనే పోయింది గుర్తొచ్చింది. తన ఆఫీసులో పనిచేస్తు జాండీస్‌తో పోయిన అటెండర్ రాములు గుర్తొచిండు. ఆదోమాదిరి తన

కొడుకు ముఖంలోకి చూస్తున్నపుడు గొంతు ఎండుకపోయి మాట పెగలటం కష్టంగావుంది. ఆయినా డాక్టర్‌వైపు చూస్తు.

“ఈ జాండీస్ దేనివల్ల వస్తుంది అంటరు”

అని అంటు డాక్టర్ ముఖంలోకి చూస్తునప్పుడు.

“ఒక రకంగా అని చెప్పలేం, ముఖ్యంగా నీటి కాలుష్యంతో వస్తుంది”

అనగానే రామరాజుకు చెంపమీద కొట్టినట్టయింది. కాస్త కదిలి కూర్చున్నడు. అందుకె మీరు ఏ నీళ్లు వాడుతరు అని తొలుతనె అడిగిండన్నమాట అనుకున్నడు.

*

“బాబు తలనీలాలు తీయించాలి పదండి” భర్తతో అంది సుశీల.

“అమ్మా వద్దు. స్కూల్లో అందరు ఎగతాలి చేస్తరు” అన్నడు రవి తల్లివైపు తండ్రివైపు ఆందోళనగా చూస్తు.

“సరె బాబు. నీఇష్టం” అన్నడు రాజు కొడుకు తల నిమురుతు.

“ఏంది నీఇష్టం బాగుంది నీష్టం వాని ఇష్టం, వానికి జ్వరం వొచ్చినప్పుడు ఓబంగీనా తగ్గకపోతే. నేను మొక్కకున్న వాని తలనీలాలు అర్పిస్తని అంది సుశీల వెటకారంగా ముఖంపెడుతు తండ్రి చేతిలో చేయివుంచి నిలుచున్న కొడుకును తన దగ్గర్కి లాక్కొంటు.

“వాడు వద్దంటుంటె ఎందుకె బలవంతం” అన్నడు రాజు.

“మొక్కుకున్నది నేను వాడు కాదు” ముఖాన్నిచిట్లిస్తు చూస్తు అంది.

“ నాని బొచ్చుమీద నీమొక్కు ఏంది? బోడి ఆలోచన.” అన్నడు రాజు.

“వానివెకాదు నావికూడ తీయిస్త అని మొక్కిన. పదర“ అంటు కొడుకును నెట్టుకుంటు మంగలివాళ్ల వైపు నడిచింది.

“ఏంటినీవుకూడ గుండు చేయించుకుంటవా. నీకేమన్న మతిపోయిందా. ఆడవాళ్లకు అందం కురులేనే పిచ్చిమొకమా”

అన్నాడు రాజు కాస్త రోషంగా.

“నాఅందం సంగతి నాకంటె నీకు ఎక్కువ తెలుసా. అయినా వీడు పుట్టినప్పుడు మొక్కుకున్న. ప్రసవం మంచిగ జరిగితె తలనీలాలిస్తా అని” అంది ఏదో జ్ఞాపకాలలోకి వెళ్లుతు.

"మరి నాచురల్‌గ ఎక్కడ జరిగింది. నీకాన్పు దినమంతా పెయిన్సేనాయె. చివరికి సిజెరియన్ తప్పదాయె వేలకు వేలు ఖర్చొచ్చె.

"వస్తె వచ్చె తల్లి-బిడ్డ ఇద్దరం క్షేమంగా బయటపడ్డంగ. అయినా పురుడు పోసుకునేది నేనా నీవా. మీ మొగవాళ్లకేం తెలుసు. ఆ నొప్పులు పడెటోళ్లకు తెలుస్తుంది సుమా.

"పదరబాబు మొక్కుకున్నం కనక మొక్క తీర్చుకోవల్సిందె"

అంటు బాబు రెక్క పట్టుకుని కల్యాణకట్ట దగ్గరికి నడిచింది. అక్కడ జనం బారులు తీరి నిలుచున్నరు.

అతనికప్పుడు గతం కళ్లముందు తిరిగింది. పెళ్లిచూపులన్నపుడు ఆమె పొడగాటి జడకూడ తనను ఆకర్షించినవాటిల్లో ఒకటి. పెళ్లిలో పుస్తె కట్టెటపుడు ఆజడను పక్కన కూర్చున్న ఆవిడ అతి భారంగా లేపింది, తాను మూడు ముళ్లు వేసింది గుర్తొంది. సిగో జడో వేసుకున్న మల్లేసేరులు వేలాడుతు. నల్లని కొండ మీదినుండి తెల్లని సెలఏరు జారుతున్నట్టు ఎంత అందం! అంతెకాదు. మల్లెలు తలలో పెట్టుకుని పక్క మీద వొరిగినపుడు గదినిండా ఎంత సువాసన. ఉదయమే స్నానంచేసి తలకు తుండు బిగించి వాకిట్లో ముగ్గేస్తుంటే ఎంత ఆకర్షణ. అందాన్ని రెట్టింపుచేసే ఆ నల్లని కురులను తొలిగించినాక ఆ గుండు ముఖాన్ని చూడబుద్ధి అవుతుందా? ఆడదాని సహజ అందమంటేనే కురులు.

"ఏయ్ సుశి బాబును వదిలేయి నీవుమాత్రం గుండు చేయించుకోవద్దు" అని అరిచాడు. ఆ కేకను విని కూడ విననట్టె నడిచింది. ఛీ వీళ్లకు తెలవదు. చెవితె వినరు. భార్య అందాన్ని తనవితీర చూసేది భర్తేకదా? అనుకుంటున్నప్పుడు

" స్వామి వారి బొమ్మవున్న ఉంగరాలు మెడ బిల్లలు కావాల బాబు అంటు మెడకు అర్మని పెట్టెలాంటి ఓ మినీషోకేసును ఎడమచేతిలో నల్లరంగు దారాలను పట్టుకుని పలకరించాడు. ఓ వ్యక్తి వద్దు అన్నట్టు చూసాడు. రామరాజు

"ఇంత దూరం వచ్చి ఈకొండెక్కి ఇవి లేకుంట వెళ్లకూడదండి. ఎంత అవుతుంది ఈచిన్న ఖర్చుకె భయపడతార." అన్నడు అమ్మేవాడు

"ఖర్చు సంగతి వొదిలేయి. వాటివల్ల వొరిగేది ఏంలేదు" అంటువినుకున్నట్టు చూసాడు.
"ఆట్లా చూస్తారేమి. మీరుకొనకున్న ఇక్కడికి వస్తున్న లక్షలమంది కొంటరు. ఇవేమి పాసిపోయేయి ఏంకాదు మిమ్ముల బతిమిలాడడానికి" నవ్వు ముఖంతో అనుకుంటు కదిలాడు. అవును అక్కడ తిరిగాడే ప్రతివానిచేతికి ఈదారాలు, వెళ్లకు ఉంగరాలు కనిపిస్తున్నాయి. ఇంతకుచ్చగా ఈదారాలు కట్టుకోవడంవల్ల అదనంగా వీళ్లకు వొరిగేది ఏముంది? పోగ ఇవి తడిసి, బిగుసుకపోయి ఆక్కడ ఓమాదిరి బాక్టీరియాక్రిములు పుట్టుకొచ్చి తినెటపుడు ముఖం తూడ్చుకునెటపుడు అవి శ్వాసద్వార, ఆహారం ద్వార లోపలికి వెళ్లి ఇన్‌ఫెక్షన్‌కు గురిచేస్తుంది. ఈదారాలు ఒకింత కీడేగాని మేలు చేసేది లేదు. అంటు నిట్టూర్చుతు చుట్టు చూసాడు. ఆక్కడికొచ్చిన ఆందరి చేతులకు అవె దారాలు. ఓజత గుండు చేయించుకుని చేతిలో చేయివేసి నవ్వుతూ తనముందు నుండే నడిచారు. ఆమెకు పాతిక అతనికి ముప్పై ఉండొచ్చు బహూశా సంతానంకొసం మొక్కుకుండ్రేమో వీళ్లు ఇంకారాలేదేమి. అని, గుండ్లు చేయించుకుని వస్తున్న వాళ్లను చూస్తు నిలుచున్నారు. చిన్నపెద్ద, ఆడమగ బొడిగుండ్లుతో కుమ్మరిపేర్చిన కుండలవరుసలా కనిపిస్తు కదులుతూవున్నరు. ఎవరు ఎవరైంది తెలుసుకొవడం కష్టం. చూడగ చూడగ చివరికి తనవాళ్ల కనిపించారు.
"ఏయ్ సుశి ఎక్కడికి అటువెలుతున్నరు. మనముంటున్న సత్రం వున్నది ఇటు"అంటు కేకలేసాడు. వినికూడ విననట్టే ముందుకు నడుస్తూ వుంటె ఆమెవెంట బాబు
"అక్కడే వుండండి గుండంలో మునిగివస్తం"
అంటు గుండంవైపు నడుస్తువుంది. చేతిలో బాబుచేయి. గుండు గీయించినందుకు తల్లినిఈసడిస్తూ చూస్తున్నాడే తప్ప ఏం చేయలేని స్థితి. ఆదిచూసిన రామరాజు వడివడిగావచ్చి "ఏయ్ నీకె చెప్పెది గుండంలో వద్దు సత్రంలో చేద్దురుగాని రండి" అన్నడు.
"చూడండి మీరు ప్రతిదానికి ఆడ్డుతగలకండి. మొక్కుమొక్కే" అంది కాస్తగట్టిగా.

5827

"ఏం మొక్కో ఏమోపనికిమాలిన మొక్కు అంటు గునిసిండు.

"అట్ల అనకండి అపచారం, కళ్లుపోతయి" అంటు ముందుకు నడిచింది, వెనకాలబాబు

"అసలు ఆగుండంవైపు ఓసారి చూడు. నీళ్లు ఎట్లావున్నాయో అందులో మునగాలా. అ అంచులపొంటి ఓసారి చూడు. మూత్రం పోసిన గుర్తులు, వాకిట్లో గొబ్బెమ్మల్లా ఆముద్దలు! ఛా నీకెమన్న బుద్ధివుందా?" అంటు అరచినంత పనిచేసాడు. "వాటిని చూడొద్దు. గుడిగుండం అంతే" అంది నిక్కచ్చుగ తననిర్ణయాన్ని ప్రకటిస్తూ.

"నిన్ను మార్చడం నాతరంకాదే" అంటు నుదురును చేత్తో తాకుకున్నడు రామరాజు.

" నీభక్తి నీఇష్టంకాని బాబుగాన్ని నీలాగ తయారు చేస్తున్నవు. నీవు రార బాబు సత్రంలో చేదువుగాని" అంటు బాబును రమ్మని సైగచేసాడు.

"అవును ఆనీళ్లు బాగలేవా  చెంపలేసుకో.నీకోసమెరా తండ్రి రా" అంటు బాబు చేయిపుట్టుకుని గుండంవైపు నడిచింది. ఏం అనలేక రామరాజు బొమ్మలా నిలుచుండి పోయాడు. తాను చదువుకున్న చదువు ఎందుకు పనికి రాలేదు. తన పంతులు పని ఆమె ముందు నిల్వలేక విచారిస్తు సత్రం వైపు నడిచాడు.

అది సంగతి ఆరోజు ఆనీటిలో మునగడంవల్లా ఈ జాండీస్, మనస్సులో భార్యను తిట్టుకున్నాడు. ఈగండం గట్టెక్కేది ఎట్లనో అని ఆలోచిస్తున్నపుడు డాక్టర్ అన్నమాటలు పదెపదె గుర్తురాసాగాయి.

● అక్టోబర్ 2004